## రామానుజమ్మకు ఉగాది పురస్కారం



రామానుజమ్మ

రాజన్న సిరిసిల్ల, మార్చి24 (నమస్తే తెలంగాణ): పరుగుపందెంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభచూపిన ప్రముఖ క్రీడాకారిణి టమాటం రామానుజమ్మ ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. శ్రీలంబోదర కల్చరల్ అకాడమీ నేషనల్ లెవల్ డ్యాన్స్ ఫెస్టివల్‌ను పురస్కరించుకొని ప్రతిభగల క్రీడాకారులకు ఉగాది పురస్కారాలు–2024 ప్రదానం చేస్తున్నది. ఈ క్రమంలో జాతీయస్థాయి ఉగాది నంది అవార్డుకు రామానుజమ్మ ఎంపికయ్యారు. ఈ నెల 31న వేములవాడ రాజన్న ఆలయ ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో ఆమె నంది అవార్డు అందుకోనున్నారు.

## శివకల్యాణోత్సవానికి వేళాయె

**27నుంచి రాజన్న ఆలయంలో వేడుకలు**



యాగశాల కోసం సిద్ధమైన మండపం

వేములవాడ టౌన్, మార్చి 24: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 27నుంచి 31వరకు శివకల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ వెల్లడించారు. వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు రాజన్న ఆలయం ముస్తాబవుతున్నది. ఆదిదంపతుల కల్యాణమహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని విద్యుద్దీప కాంతులతో అందంగా అలంకరించారు. స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో శివకల్యాణ మహోత్సవాన్ని ఐదురోజులపాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. బుధవారం మొదటిరోజు ఉదయం 7.15గంటల నుంచి శివభగత్పుణ్యా హవచనం, పంచగవ్య మిశ్రణం, దీక్షాధారణం, రుత్విక్ వరణం, మంటప ప్రతిష్ఠ, నవగ్రహ ప్రతిష్ఠ, గౌరిషోడశ మాతృకా ప్రతిష్ఠ, మృత్సంగ్రహణం, అంకురార్పణం, కుండ సంస్కారం, అగ్ని ప్రతిష్ఠ, శ్రీ స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, వేదపారాయణం, పరివార దేవతలకు దేవతార్చనలు నిర్వహించనున్నట్లు స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ వెల్లడించారు. సాయంత్రం 4 గంటల నుంచి స్వామివారి అద్దాల మండపంలో శ్రీ శివపురాణ ప్రవచనం, రాత్రి 7 గంటల నుంచి భేరిపూజ, దేవతాహ్వానం, నీరాజనం, తీర్థప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. 28న ఉదయం 10.50 నుంచి మధ్యాహ్నం 12.55గంటల వరకు అభిజిత్ లగ్న సుముహూర్తమున ఆదిదంపతుల కల్యాణోత్సవం, 30న మధ్యాహ్నం మూడు గంటల నుంచి రథోత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# రంగేలి

- నేడు హోలీ
- వసంతంలో తొలి పండుగ
- రెండ్రోజులపాటు వేడుకలు
- సహజ రంగులే మేలు
- రసాయనాలతో హాని



వేములవాడ పట్టణంలో హోలీ సంబరాలు (ఫైల్)

రంగుల పండుగ హోలీ వచ్చేసింది. సప్తవర్ణాలతో వసంతమాడేందుకు ఊరూవాడా సిద్ధమైంది. స్నేహభావంతో ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ మనుషులంతా సమానమని చాటి చెప్పే కలర్‌ఫుల్ వేడుక కోసం పేదా గొప్ప, చిన్నాపెద్దా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నది. నేటి ఉదయం నుంచి రెండ్రోజులపాటు రంగుల ప్రపంచంలో తేలిపోనున్నది.

– వేములవాడటౌన్, మార్చి 24

ప్రజలంతా ఉత్సాహంగా జరుపుకొనే పండుగ హోలీ. వసంత రుతువులో వచ్చే తొలి వేడుక ఇది. వసంతగమనాన్నీ, కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ పాల్గుణ పౌర్ణమి రోజు వచ్చే జరుపుకొనే ఈ పర్వదినాన్ని వసంతోత్సవం అనీ, పాల్గుణోత్సవం అని కూడా అంటారు. ఈ పండుగ రోజు చిన్నా పెద్దా తేడా లేకుండా అంతా రంగులు చల్లుకుంటారు. ఎంతో సంబురంగా జరుపుకొంటారు. ఎప్పట్లాగే ఈ సారి హోలీని ఘనంగా జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు.

### కామదహనం..

హోలీ అనగానే గుర్తొచ్చేది కాముని పున్నం. ఊళ్లలో పిల్లలు పది రోజుల ముందు నుంచే ఇంటింటా తిరుగుతూ జాజిరి ఆటలు ఆడుతారు. సేకరించిన డబ్బులు పంచుకుని, ధాన్యంతో వంటలు చేసుకుంటారు. హోలీ ముందు రోజు రాత్రి పది గంటల నుంచి కామదహనం నిర్వహిస్తారు. ఇన్ని రోజులు ఆడిన కోలలను అందులో వేస్తారు. శరీరంలోని చీడ, పీడలు వదిలి అందరికీ సర్వ సుఖాలు కలగాలని ఆశిస్తూ ఇంట్లోని పాత చెక్క వస్తువులను, కలపను చౌరస్తాలు, ప్రధాన ప్రాంతాల్లో చేర్చి దహనం చేస్తారు. మిగిలిన బూడిదను దిష్టి తగలకుండా బొట్టు పెట్టుకుంటారు. శారీరక, మానసిక ప్రశాంతత చేకూరాలని వేడుకుంటారు.

### సహజ రంగులే మేలు..

మోదుగుపూలు జనవరి, ఫిబ్రవరి నెలల్లో విరగబూస్తాయి. ప్రాచీనకాలంలో రంగుల కోసం మోదుగ పూలు వాడేవారు. ఇవి చర్మానికి ఎంతో శోభ తెచ్చేవి. మోదుగపూలను ఎండబెట్టి దాని నుంచి రంగులు తయారుచేయవచ్చు. ఇది ఆరోగ్యానికి దోహదకారి మాత్రమే గాక, ఈ కాలంలో వచ్చే రోగాలకు దివ్యమైన ఔషధంలా పని చేస్తుంది. ఇంకా హెన్నా(మైదాకు పొడి), పసుపు, కుంకుమ, చందనం, టమాట గింజలతో తయారైన పొడిని నీళ్లలో కలిపి చల్లుకునే వారు. ఇలాంటి రంగులు పూసుకోవడం ద్వారా సంతోషం, ఆనందం కలుగుతాయి. అలాగాక రసాయనాలు కలిపిన రంగులు పూసుకోవడం వల్ల లేనిపోని చర్మరోగాలు అంటుకుంటాయి. కానీ, ఇప్పుడు ఎక్కడ చూసినా రసాయనిక రంగులే కనిపిస్తున్నాయి. వీటితో లేని పోని ఆరోగ్య సమస్యలు వస్తాయి. అందుకే స్వచ్ఛమైన కుంకుమ, బుకా గుల్లాలు వంటి రంగులతో పండుగ జరుపుకొంటే మేలని నిపుణులు సూచిస్తున్నారు.



వేములవాడ రాజన్న ఆలయ గుడి చెరువులో భక్తుల విడిది కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద నిలుపుదల చేసిన వాహనాలు

## పందిళ్ల నిండా వాహనాలే..

- ఇబ్బందిపడుతున్న రాజన్న భక్తులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నపం

వేములవాడ రాజన్న సన్నిధికి వచ్చే భక్తుల విడిది కోసం గుడి చెరువు ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. వేసవిలో నాలుగు నెలలపాటు సామాన్య నిరుపేద భక్తులకు చలువ పందిళ్లే విడిది కేంద్రాలుగా ఉంటాయి. అయితే ఆదివారం రాజన్న సన్నిధికి భక్తులు తరలిరాగా, చలువపందిళ్ల కింద వాహనాలను నిలుపుదల చేశారు. కనీసం భక్తులు ఉండడానికి వీలులేకుండా పార్కింగ్ చేయడంతో, తాము ఎక్కడ ఉండాలంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

– వేములవాడ, మార్చి 24

## పంటలు బాగుండాలని..

- ఊరు మీద దున్నపోతును విడిచిన బొప్పాపూర్ గ్రామ రైతులు



గ్రామంలో దున్నపోతును విడిచిపెడుతున్న రైతులు

పిల్లాజెల్లా.. పాడిపంట.. బాగుండాలని కోరుతూ ఆదివారం బొప్పాపూర్‌లో గ్రామస్తులు మైసమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకలో భాగంగా మైసమ్మకు ఊరుమీద దున్నపోతును విడిచి, ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు బైండ్ల పూజారుల సంప్రదాయ పాటలు, డప్పుచప్పుళ్ల మధ్య దున్నపోతును వదిలారు. వేడుకల్లో పీఏసీఎస్ డైరెక్టర్ ల్యాగల సతీశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

– ఎల్లారెడ్డిపేట, మార్చి 24

## నేతన్నలకు ఉపాధి కల్పించండి

- పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

రాజన్న సిరిసిల్ల, మార్చి 24 (నమస్తే తెలంగాణ): రాజకీయాలను పక్కనపెట్టి సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూడు నెలల నుంచి వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల లబ్ధి కోసం నేతన్నల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. బతుకమ్మ చీరెల ఆర్డర్లు లేక సాంచాలు బంద్ పెట్టడంతో ఉపాధి లేక కార్మికులు పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉపాధి కల్పించేదిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై కక్షసాధింపు ధోరణితో నేతన్నల బతుకులను ఆగం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ చీరెల పెండింగ్ బకాయిలు, యారన్ సబ్సిడీ వెంటనే విడుదల చేయాలన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నేతన్నల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సంజయ్.. తన రాజకీయ ప్రయోజనాల కోసమే మాట్లాడుతున్నాడు గానీ.. వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. సమస్య తీవ్రంగా ఉందని, 20వేల కుటుంబాలు రోడ్డునపడి ఆకలితో అలమటిస్తున్నాయన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టంచేశారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభంపై పలుమార్లు మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను పరిష్కరించకుంటే లోక్‌సభ ఎన్నికల ప్రచారాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, ఎల్లారెడ్డి, సిరిమల్లె సత్యం, ఎలిగేటి రాజశేఖర్, ఒగ్గు గణేశ్, గుండేటి కనకయ్య, బింగి సంపత్ ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

### బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

బోయినపల్లి, మార్చి 24: అనంతపల్లికి చెందిన రాకేశ్ వారం క్రితం గోపాల్‌రావుపేట వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం పరామర్శించారు. రాకేశ్ కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇక్కడ కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, వన్నెల రమణారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎనుగుల కనకయ్య, ఎంపీటీసీలు ఉపేందర్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

### పేలుడు పదార్థాలు పట్టివేత

చందుర్తి, మార్చి 24: సనుగుల శివారులో పేలుడు పదార్థాలను పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రామారావుపల్లెకి చెందిన కోమిరె మల్లయ్య ఆదివారం సనుగుల శివారులోని ఓ బావి వద్ద పేలుడు పదార్థాలు వినియోగిస్తున్నారని ఎస్ఐ శ్రీకాంత్‌కి సమాచారం వచ్చింది. ఆయన వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని 24డిటోనేటర్స్, పేలుడు పదార్థాల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మల్లయ్యపై కేసు నమోదు చేశామని, ట్రాక్టర్‌ను సీజ్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

## రాజన్న ఆలయంలో రద్దీ

వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం సెలవుదినం కావడంతో రద్దీగా కనిపించింది. వేకువజాము నుంచే భక్తులు ధర్మగుండంలో స్నానాలు ఆచరించి, కోడెమొక్కు తీర్చుకున్నారు. అనంతరం క్యూలో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఆర్జిత సేవల ద్వారా రాజన్నకు సుమారు రూ.12లక్షల ఆదాయం సమకూరగా, స్వామివారిని పది వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు.

- వేములవాడ టౌన్, మార్చి 24



స్వామివారి దర్శనం కోసం క్యూలో భక్తులు

## ‘టెట్’ ఫీజు తగ్గించాలి

- బీఆర్‌ఎస్‌వై జిల్లా నేత చిరంజీవి
- బద్దెనపల్లిలో విలేకరుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌వై నేత చిరంజీవి

సిరిసిల్ల రూరల్, మార్చి 24: కాంగ్రెస్ సర్కారు టెట్–2024 పరీక్ష ఫీజును పెంచిందని, వెంటనే పెంచిన ఫీజును తగ్గించాలని బీఆర్‌ఎస్‌వై జిల్లా నేత సిలువేరి చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేసీఆర్ సర్కార్ టెట్ ఫీజును ₹400మాత్రమే విధించిందని, ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ ₹1000 తీసుకుంటున్నదని పేర్కొన్నారు. ఒక పరీక్ష రాస్తే ₹వెయ్యి, రెండు రాస్తే ₹2వేలు వరకు పెంచడం దారుణమన్నారు. దీంతో మధ్య తరగతి అభ్యర్థులపై అధిక భారం పడుతుందని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో తెలంగాణ నిరుద్యోగులకు కోసం ఏ పరీక్ష రాసిన దానికి ఫీజు లేకుండా ఉచితంగా రాసేవిధంగా ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి రాగానే ఫీజులు పెంచడం సరికాదన్నారు. తక్షణమే టెట్ ఫీజు తగ్గించాలన్నారు. సమావేశంలో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ తాజొద్దీన్, ఇమ్మనేని అమర్‌రావు, పన్యాల శ్రీనివాసరెడ్డి, చెన్నమనేని రాజేశ్వర్‌రావు, సుంచుల జీవన్, బరిగెల జగదీష్, నవీన్‌కుమార్, గడ్డమీది వరుణ్, కోల సాయి, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే సుంకె పరామర్శ



నమస్తే తెలంగాణ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి ప్రకాశ్‌రావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

సిరిసిల్ల రూరల్, మార్చి 24: నమస్తే తెలంగాణ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కడపత్రి ప్రకాశ్‌రావును చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ప్రకాశ్‌రావు తల్లి సావిత్రిబాయి(90) ఆదివారం మృతి చెందింది. స్వగ్రామమైన తంగళ్లపల్లి మండలం చీర్లవంచ పరిధిలోని నాయినోరిపల్లెలో ఆమె తుదిశ్వాస విడువగా, ఈ విషయం తెలుసుకున్న సుంకె రవిశంకర్ వెంటనే గ్రామానికి వెళ్లారు. సావిత్రిబాయి భౌతికకాయానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ప్రకాశ్‌రావును పరామర్శించారు. సుంకెతో పాటు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, లయన్స్ క్లబ్ సభ్యులు, పలువురు ప్రముఖులు పరామర్శించారు.

**అధైర్యపడొద్దు.. అండగా ఉంటా..**

బోయినపల్లి, మార్చి 24: అధైర్యపడొ ద్దు.. అండగా ఉంటానని బాధిత కుటుంబ సభ్యులకు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ భరోసానిచ్చారు. బోయినపల్లి మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన అలువాల రాకేశ్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను సుంకె రవిశంకర్ పరామర్శించారు. రాకేశ్ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఆజ్జు, నాయకులు పురుషోత్తంరెడ్డి, రాజయ్య, మల్లేశం, తదితరులు ఉన్నారు.

## కనులపండువగా డోలోత్సవం



అద్దాల మండపంలో డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, మార్చి 24: త్రిరాత్రోత్సవాల్లో భాగంగా రాజన్న ఆలయంలో రెండోరోజు ఆదివారం రాత్రి డోలోత్సవాన్ని స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అద్దాల మండపంలో వేదపండితులు ఆలయ హరిహరులకు విశేషపూజ చేసి పవళింపు సేవతో డోలోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు తన్మయత్వం చెందారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

వేములవాడ రూరల్/కోనరావుపేట, మార్చి 24: వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటలో జంకె రామవ్వ, వినోద ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇక్కడ జంకె సత్తయ్య, రాము, గంగయ్య, పరశురాములు, అశోక్‌రెడ్డి, అంజి, తిరుపతిరెడ్డి, మహేశ్, తదితరులు ఉన్నారు. అలాగే కోనరావుపేట మండలం వట్టిమల్ల(గొల్లపల్లి)లో బీఆర్‌ఎస్ నాయకుడు సుంకె భూమయ్య తండ్రి లింగయ్య ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి ఆదివారం పరార్శించారు. ఇక్కడ బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, మాజీ సర్పంచ్ గోపు పర్శయ్య, గ్రామాధ్యక్షుడు వరాల మల్లేశం, బండ రవి ఉన్నారు.

ముస్తాబాద్, మార్చి 24: రాంరెడ్డిపల్లె సర్పంచ్ నాంపల్లి పోచమ్మ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మాజీ సర్పంచులు, నాయకులు ఆదివారం పరామర్శించారు. ఇక్కడ జడ్పీటీసీ గుండం నర్స య్య, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కలకొండ కిషన్‌రావు, మాజీ సర్పంచులు జగ్గ నరేశ్, బద్ది కళ్యాణి, భానురేసు లక్ష్మి, మల్లేశం, కరుణాకర్, ఎల్లం చాకలి రమేశ్, ఏనుగు వేణు, తదితరులు ఉన్నారు.

## లక్ష్యం మూడు లక్షల మెట్రిక్ టన్నులు

- ధాన్యం కొనుగోళ్లకు మార్కెటింగ్‌శాఖ సన్నద్ధం

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): యాసంగి వరి పంట కోతకు వస్తున్న వేళ.. ధాన్యం కొనుగోళ్లకు జిల్లా మార్కెటింగ్‌శాఖ ఏర్పాట్లు పూర్తి చేస్తున్నది. వడగండ్ల వాన పంటలకు నష్టం కలిగించిన నేపథ్యంలో మూడు లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసింది. జిల్లా వ్యాప్తంగా 259 కేంద్రాల ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేసింది. ఐకేపీ ఆధ్వర్యంలో 44, సహకార సంఘం ఆధ్వర్యంలో 201, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 10, మెప్మా ఆధ్వర్యంలో నాలుగు కేంద్రాలను కేటాయించింది. ఏప్రిల్ మొదటి వారంలో కేంద్రాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుండగా, ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,203, బీ గ్రేడ్‌కు రూ.2,183మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది. అలాగే కేంద్రాల్లో ధాన్యం సేకరణకు సంబంధించిన యంత్రాలు, టార్పిన్లు, వివిధ రకాల సామగ్రి సిద్ధం చేశారు.

### సంఘం అభివృద్ధికి సహకరించాలి



ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో మున్నూరుకాపు కులస్తులు

కోనరావుపేట, మార్చి 24: సంఘం అభివృద్ధికి సహకరించాలని మామిడిపల్లి గ్రామానికి చెందిన మున్నూరుకాపు కులస్తులు ఆదివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం వారు విప్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇక్కడ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు రాజారాం, నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, రాజయ్య, నారాయణ, రాములు, గంగయ్య, తదితరులు ఉన్నారు.

### కల్యాణోత్సవానికి ముస్తాబు

రుద్రంగి, మార్చి 24: మండల కేంద్రంలోని ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం కల్యాణోత్సవానికి ముస్తాబైంది. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం యజ్ఞం, అన్నదానం, స్వామివారి జాతర, హారతి, తీర్థప్రసాదాలు వితరణ ఉంటుందని తెలిపారు. కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ముస్తాబాద్, మార్చి 24: రోడ్డు ప్రమాదంలో చిప్పలపల్లి గ్రామానికి చెందిన పడిగె మల్లయ్య (68) ఆదివారం మృతి చెందాడు. గంభీరావుపేట మండలం లింగన్నపేట నుంచి చిప్పలపల్లికి మల్లయ్య టీవీఎస్ మోపెడ్‌పై వస్తుండగా, వెనుక నుంచి ఆటో ఢీకొన్నది. గాయాలైన మల్లయ్యను ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా అక్కడ మృతి చెందాడు. మల్లయ్య భార్య రెండు సంవత్సరాల క్రితం గుండెపోటుతో మృతి చెందగా, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

### చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

వేములవాడ రూరల్, మార్చి 24: వేములవాడ మండలం అరెపల్లిలోని హనుమాన్ ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ సీఐ కరుణాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఈ నెల 21న ఆరెపల్లిలోని హనుమాన్ ఆలయ తాళం పగులగొట్టి పుస్తెమట్టెలు, రూ.వెయ్యి నగదును చోరీ చేయగా, స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ క్రమంలో ఈ నెల 22న వాహనాల తనిఖీలు చేస్తుండగా, పెద్దపల్లి మండలం హన్మాంతునిపేటకు చెందిన శ్రీధండా పాణి అనిల్, కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన రాచర్ల రాజమల్లు అనుమానాస్పదంగా కనిపించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, మా క్లయింట్ కైలాసకోటి మహేష్ తండ్రి రాజన్న, వయస్సు 31, వృత్తి అగ్రికల్చర్, ఇంటి నెం. 1-2-53, మల్యాల గ్రామం మరియు మండలం, జగిత్యాల జిల్లా గారు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించుచూ, ఏజెంట్ పన్యాల రాజమౌళి తండ్రి కోటయ్య, వయసు 55, వృత్తి వ్యాపారం, ఇంటి నెం. 9-1-126/1, రాజీవ్ నగర్, వేములవాడ గ్రామం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి చేసిన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కోనారావుపేట్ గ్రామ శివారులోగల భూమిని, తేది: 23-01-2020 రోజున జనరల్ పవర్ ఆఫ్ అటర్నీ రిజిస్టర్డ్ డాక్యుమెంటును రద్దు (క్యాన్సల్) చేయుటకు గాను ఏజెంట్ ఐన పన్యాల రాజమౌళి గారికి 19-03-2024 రోజున రిజిస్టర్ పోస్ట్ ద్వారా లీగల్ నోటీస్‌ను ప్రిన్సిపాల్ కైలాస కోటి మహేష్, ఏజెంట్ పన్యాల రాజమౌళి గారికి తెలియపరచడమైనది. కావున ఇక నుండి ఏజెంట్ పన్యాల రాజమౌళి గారికి ఎలాంటి హక్కులు ఉండవని, ఇట్టి పత్రికా ప్రకటన ద్వారా తెల్పడమైనది. ఇట్టి విషయమై ఎలాంటి అభ్యంతరాలున్న 10 రోజులలోపు తెలుపగలరు.

ఇట్లు:
**నాలం శశిధర్,** అడ్వకేట్
ఇంటి నెం. 10-6-216, కిసాన్‌నగర్, కరీంనగర్,
జిల్లా: కరీంనగర్, పిన్: 505001,
సెల్: 9398129200

## ముదిరాజ్‌లు ఐక్యతతో అభివృద్ధి చెందాలి

గంభీరావుపేట, మార్చి 24: ముదిరాజ్‌లు ఐక్యతతో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం గంభీరావుపేటలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కల్యాణ మండపాన్ని సందర్శించారు. ముదిరాజ్‌లు ఐక్యంగా ఉంటూ, సంఘం అభివృద్ధికి పాటుపడాలన్నారు. మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కల్యాణ మండపాన్ని నిర్మించుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. ఇక్కడ నాయకులు దండవేని లక్ష్మణ్, కర్నాల శ్రీనివాస్, నాగారపు దేవేందర్, పిట్ల బాబు, ఈరవేని సంజీవ్, నాగారపు శ్రీశైలం, దండవేని మీనయ్య, కర్నాల సత్యం, ఈరవేని దేవయ్య, పిట్ల స్వామి, దండవేని నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.



సంఘం నాయకులతో కొండూరి రవీందర్‌రావు

### జిల్లా అధ్యక్షుడిగా సత్యనారాయణ

వేములవాడ రూరల్, మార్చి 24: మాల జంగం మహేశ్వరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆరె సత్యనారయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వేములవాడ మండలం అగ్రహారం ఆలయ ఆవరణలో ఆదివారం సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఆరె సత్యనారయణ, ప్రధాన కార్యదర్శిగా ఏరుపు రాజేశం, కోశాధికారిగా కందూరి సత్యలింగం, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా చిదిరె ప్రభుస్వామిని ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులు కురుకుంట శ్రీశైలం, ఆరె భిక్షపతి తెలిపారు. నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు అభినందించారు.

### ఇసుక రవాణా చేస్తే చర్యలు

ముస్తాబాద్, మార్చి 24. మానేరు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. కొండాపూర్ మానేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఆదివారం ఇసుకను తరలిస్తుండగా రాంరెడ్డిపల్లె వద్ద టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా మద్దూర్ కొండాపూర్ మండలం దూలమెట్లకు చెందిన ఇస్లావత్ భాస్కర్‌ను సిరిసిల్ల న్యాయమూర్తి వద్ద హాజరుపర్చగా రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

### సల్లంగసూడు పోచమ్మతల్లి

ముస్తాబాద్, మార్చి 24: పిల్లాపాపలు, పాడిపంటలతో సల్లంగసూడు పోచమ్మ తల్లీ.. అంటూ ఎంపీపీ శరత్‌రావు అమ్మవారిని వేడుకున్నారు. ఆదివారం మద్దికుంట పోచమ్మ ఆలయంలో గడప ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోచమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించడం సంతోషకరమని, అందరి సహకారంతో ఆలయాన్ని పూర్తి చేసి, వచ్చే నెలలో విగ్రహ ప్రతిష్ఠ జరుపనున్నట్లు తెలిపారు.